రైతుల మధ్య చిచ్చుపెడుతున్న

కాంగ్రెస్ నేతలు

- దేవాదుల మోటర్లను 15 రోజులుగా బంద్ చేసినా పట్టించుకోని మంత్రులు
- ఈరోజు మోటర్లు ఆన్ చేయగానే రాజకీయ లబ్ధి కోసం డ్రామాలు
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆగ్రహం

జనగామ, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ) : దేవాదుల రిజర్వాయర్ల నుంచి సాగునీరందక జనగామ నియోజకవర్గంలో పంట పొలాలు ఎండిపోతున్నా పట్టించుకోని అధికార పార్టీ నేతలు అమాయక రైతుల మధ్య చిచ్చుపెడుతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి శనివారం ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. జనగామ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఎండిన పొలాలు పశువులకు మేతగా మారిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేశారు. దేవాదుల ప్రాజెక్ట్ ఎత్తిపోతల పథకంలో భాగంగా ధర్మసాగర్ నుంచి గండి రామారం రిజర్వాయర్‌కు నీటిని లిఫ్ట్ చేయాల్సిన మోటర్లు 15 రోజులుగా బంద్ చేస్తే, అధికార పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు పట్టించుకోకుండా కూర్చున్నారని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యేగా ఈఎన్‌సీ అనిల్‌కుమార్, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్, సెక్రటరీ రాహుల్ బొజ్జాను అనేక సార్లు కలిసి ఓఅండ్‌ఎం స్టాఫ్‌కు ఇవ్వాల్సిన బకాయిలను ఇప్పించి మోటర్లను ఆన్ చేయించినట్టు తెలిపారు. గండి రామారం రిజర్వాయర్‌కు రావాల్సిన లైనులో జెట్ లెట్లు ఉన్న అన్ని ప్రాంతాలకు నీళ్లు వెళ్తాయని పేర్కొన్నారు. జెట్‌లెట్లకు పోగా వచ్చే నీళ్లు గండి రామారం రిజర్వాయర్‌కు చేరుకొని, అక్కడి నుంచి బొమ్మకూరు, కన్నెబోయిన గూడెం, వెల్దండ, లద్దునూరు, తపాస్‌పల్లి రిజర్వాయర్లను నింపాల్సి ఉందన్నారు. వీటి ద్వారా జనగామ నియోజకవర్గంలోని 80 శాతం ఆయకట్టుకు నీరు అందాల్సిన అవసరం ఉందని పల్లా తెలిపారు. 15 రోజుల పాటు ఓఅండ్‌ఎం స్టాఫ్ మోటర్లు బంద్ చేస్తే పట్టించుకోని అధికార పార్టీ నాయకులు ఈ రోజు మోటర్లను ఆన్ చేయగానే 'తగుదునమ్మ' అంటూ గండి రామారం రిజర్వాయర్ దగ్గరకు వచ్చి డ్రామాలు ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి అమాయక రైతుల మధ్య చిచ్చు పెట్టడం సిగ్గుచేటన్నారు.

సర్వే చేస్తున్న అధికారుల వద్దకు వెళ్తున్న రైతులను అడ్డగించిన పోలీసులు

సర్వేకు నిరసన సెగ

- పోలీసుల పహారాలో భూ సర్వే
- భూమి పోతుందని కుమిలి దవాఖాన పాలైన రైతు

మక్తల్, ఫిబ్రవరి 22 : నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పనుల సర్వే పోలీసుల పహారాలో కొనసాగుతున్నది. శనివారం నారాయణపేట జిల్లా మక్తల్ మండలం కాట్రేవ్‌పల్లి శివారులో రైతులకు తెలియకుండా భూ సర్వేకు అధికారులు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకొన్న కర్షకులు పొలాల వద్దకు వెళ్లగా.. పోలీసులు అడ్డుకున్నారు. ఏండ్ల తరబడి వ్యవసాయాన్నే నమ్ముకొని బతుకుతున్న తమ జీవితాల్లో ప్రాజెక్టు పేరిట చీకటి నింపుతున్నారని మండిపడ్డారు. భూమిని కోల్పోయి ఎలా బతకాలని గుండె బరువెక్కిన రైతు ఊషన్నగౌడ్ దవాఖాన పాలయ్యాడు. నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పనుల భూసర్వే చేపట్టడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పసుపు రైతులకు బోనస్ ఇవ్వాలి

ధరల పతనంతో నష్టపోయే మొత్తాన్ని రాష్ట్రం భరించాలి

క్వింటాకు 15 వేలు ఇస్తామన్న కేంద్రం హామీ నిలబెట్టుకోవాలి

రేవంత్‌రెడ్డి అవగాహన లేమితో తెలంగాణకు అన్యాయం

నిజామాబాద్ పసుపు మార్కెట్‌లో ఎమ్మెల్సీ కవిత

పసుపు రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

నిజామాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో పసుపు ధరలు ఘోరంగా పతనమవుతున్నాయని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తంచేశారు. రైతులకు శ్రమకు తగిన ఫలితం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్వింటాల్‌కు రూ.8 వేలు మాత్రమే ధర వస్తున్నదని, గరిష్ఠంగా రూ.11 వేలు దాటకపోవడం బాధాకరమని అన్నారు. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు శనివారం వచ్చిన కవిత.. పసుపు కుప్పలను సందర్శించారు. జగిత్యాల, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల నుంచి వచ్చిన పసుపు రైతులతో మాట్లాడి వారి సాధక బాధకాలు తెలుసుకున్నారు. బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల నుంచి వచ్చిన రైతులతో పాటు నిర్మల్, జగిత్యాల జిల్లాల నుంచి పసుపు తీసుకొచ్చిన రైతులు తమ ఇబ్బందులను వివరించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు.

పసుపుబోర్డుతో ఒరిగిందేమీ లేదు..

ఎన్నికలప్పుడు నిజామాబాద్‌కు వచ్చిన బీజేపీ నేతలంతా పసుపునకు రూ.15వేలు ఇస్తామని చెప్పారని కవిత గుర్తుచేశారు. పసుపుబోర్డు ఏర్పాటుపై తూతూ మంత్రంగా గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చి చట్టబద్ధత కల్పించలేదని విమర్శించారు. ధర పడిపోయే పరిస్థితి వచ్చినప్పటికీ పసుపుబోర్డుతో ఒరిగిందేమీ లేదని అన్నారు. పార్లమెంట్‌లో పసుపుబోర్డు బిల్లు పెడితే దేశంలో నాసిరకం పసుపు దిగుమతి ఆగిపోతుందని, తద్వారా మన రైతులు పండించిన పంటకు ధర పెరుగుతుందని చెప్పారు. నిజామాబాద్ మార్కెట్‌లో వ్యాపారులంతా సిండికేట్ అయ్యారని ఆరోపించారు. మొత్తానికి మొత్తం ధరను తగ్గిస్తున్నారని మండిపడ్డారు.

అవగాహన లేని సీఎంతో రాష్ట్రానికి అన్యాయం..

మహబూబ్‌నగర్ సభలో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కవిత స్పందించారు. ప్రజాభవన్‌లో ఏపీ, తెలంగాణ సీఎంల సమావేశం సందర్భంగా బనకచర్ల ప్రాజెక్టు చేపడతామని చంద్రబాబు ప్రకటించారని గుర్తుచేశారు. గోదావరి నుంచి 200 టీఎంసీలు తరలించడానికి ఏపీ ప్రాజెక్టు సిద్ధమైందని, మన దగ్గరి నుంచి 199 టీఎంసీల నీటిని ఏపీ ఎత్తుకుపోతుంటే ముఖ్యమంత్రి చూస్తూ నిలబడ్డారని మండిపడ్డారు. అవగాహన లేని ముఖ్యమంత్రితో తెలంగాణకు తీరని అన్యాయం జరుగుతున్నదని అన్నారు. బ్యాగుతో దొరికిన రేవంత్‌రెడ్డి జుట్టు చంద్రబాబు చేతిలో ఉన్నదని, చంద్రబాబు జుట్టు మోదీ చేతిలో ఉన్నదని ఎద్దేవా చేశారు. వాళ్లిద్దరూ ఎలా చెప్తే రేవంత్‌రెడ్డి అలా నడుచుకుంటున్నారని విమర్శించారు. ఆనాడు రాయలసీమ ప్రాజెక్టు కడితే కేసీఆర్ వెళ్లి ప్రధానికి ఫిర్యాదు చేశారని, కేసులు కూడా వేశారని గుర్తుచేశారు. నువ్వెందుకు స్పందించడం లేదంటూ రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. బనకచర్లపై కోర్టులో కేసులు వేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఎందుకు చొరవ చూపడం లేదని ప్రశ్నించారు. వ్యక్తిగతంగా కామెంట్ చేయడం, నోరు ఉందని ఎటు పడితే అటు ఒర్రుడే కానీ ఇచ్చిన హామీలు నెరవేర్చడం రేవంత్‌రెడ్డికి చాతనైతలేదని మండిపడ్డారు. తనపై వ్యక్తిగత ఆరోపణలు చేయొద్దని సుప్రీంకోర్టు చీవాట్లు పెట్టినా బుద్ధి మారడం లేదని విమర్శించారు.

1న కలెక్టరేట్ ముట్టడి

పసుపునకు రూ.15వేల కనీస మద్దతు ధర దక్కే వరకూ కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేస్తూనే, మరోవైపు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు రూ.12వేలు అమలు జరిగేలా ఉద్యమిస్తామని కవిత వెల్లడించారు. ఎన్నికల సమయంలో రేవంత్, రాహుల్‌గాంధీ స్వయంగా పసుపు రైతులకు 12వేలు భర్తీ చేసి ఆదుకుంటామని చెప్పారని గుర్తుచేశారు. ఒక రైతు తన పంటను క్వింటాకు రూ.8 వేలకు అమ్ముకుంటే మిగిలిన 4వేలు బోనస్ రూపంలో రేవంత్ సర్కారు ఇవ్వాల్సి ఉందని అన్నారు. రైతులంతా పోరాటం చేసే సమయం ఆసన్నమైందని మార్చి 1న కలెక్టరేట్ దిగ్బంధనం చేద్దామని కవిత పిలుపునిచ్చారు.

కేఆర్‌ఎంబీ మీటింగ్‌కు హరీశ్‌ను పిలవాలి

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నగేశ్ ముదిరాజ్

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): కృష్ణాజలాల వినియోగంపై కృష్ణానది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సోమవారం నిర్వహించే సమావేశానికి మాజీ మంత్రి హరీశ్‌రావును ఆహ్వానించాలని బీఆర్ఎస్ సీనియర్ నేత ఎం నగేశ్ ముదిరాజ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. కృష్ణాజలాలను ఏపీ ప్రభుత్వం దోపిడీ చేస్తున్నదని విమర్శించారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రను వీడాలని సూచించారు. ఏపీ జలదోపిడీపై హరీశ్‌రావు చెప్పేంతవరకూ ప్రభుత్వానికి సోయి రాలేదని మండిపడ్డారు. బీజేపీ నాయకులు కేంద్రంతో మాట్లాడి ఏపీ నీటి అక్రమ తరలింపును అడ్డుకోవాలని కోరారు. ఆంధ్ర పాలకులతో కుమ్మక్కైన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఉద్దేశపూర్వకంగా హరీశ్‌రావును ఫోన్‌ట్యాపింగ్ కేసులో ఇరికించాలని చూస్తున్నదని విమర్శించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

- పెట్టుబడి కోసం 5 లక్షల అప్పు
- తీర్చే దారిలేక మానుకోట జిల్లాలో బలవన్మరణం

రాజేశ్ (ఫైల్)

గూడూరు, ఫిబ్రవరి 22: పంటలకు గిట్టుబాటు ధర రాక అప్పుల బాధతో రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మహబూబాబాద్ జిల్లా గాజులగట్టు శివారు పాటిమీదిగూడెంలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పాటిమీది గూడేనికి చెందిన సంగెపు రాజేశ్ (28) తనకున్న ఐదెకరాల్లో వరి, పత్తి, మక్క పంటలు సాగు చేశాడు. పెట్టుబడికి రూ.5 లక్షల వరకు అప్పు చేశాడు. పంటలకు గిట్టుబాటు ధర రాక కొంతకాలంగా ఆవేదనతో ఉంటున్న రాజేశ్ శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు రాజేశ్‌ను మహబూబాబాద్‌లోని ఏరియా దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ అదే రాత్రి చనిపోయాడు.

వేసవిలో తాగునీటి సమస్యలు ఉండొద్దు

త్వరలో 14,236 అంగన్‌వాడీ పోస్టుల భర్తీ: మంత్రి సీతక్క

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): వచ్చే వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సీతక్క ఆదేశించారు. తాగునీటి ఎద్దడిపై శనివారం మిషన్ భగీరథ అధికారులతో సచివాలయంలో మంత్రి సీతక్క సమీక్ష సమావేశం నిర్వహించారు. రిజర్వాయర్లలో నీటినిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 6,399 అంగన్‌వాడీ, 7,837 హెల్పర్ పోస్టులను త్వరలో భర్తీ చేయనున్నట్టు మంత్రి సీతక్క వెల్లడించారు.

బోనస్ ఇవ్వాలని బీఆర్ఎస్ ధర్నా

- మంచిర్యాల జిల్లా దండేపల్లిలో ఆందోళన
- బోనస్ పేరిట బోగస్ మాటలు
- మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు ఫైర్



దండేపల్లి ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దండేపల్లి, ఫిబ్రవరి 22 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ దండేపల్లి మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ మంచిర్యాల నియోజకవర్గ రైతులకు బోనస్ కింద ఇంకా 98 శాతం డబ్బులు రావాల్సి ఉన్నదని అన్నారు. కనీసం గ్రామానికొకరికి కూడా బోనస్ వేయని ఘనత ఈ కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఎద్దేవా చేశారు. బోనస్ పేరిట బోగస్ మాటలు చెప్పిన ప్రభుత్వానికి రైతులు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. నియోజకవర్గంలో సన్న వడ్లకు ఇంకా రూ.7.5 కోట్ల బోనస్ రావాల్సి ఉన్నదని తెలిపారు. రైతులకు న్యాయం జరిగే వరకూ వారి పక్షాన ఆందోళనలు నిర్వహిస్తామని ప్రకటించారు.

వ్యవసాయ మోటర్ బిల్లు కట్టలేదా

ఇంటి మీటర్ కనెక్షన్ కట్!

- పెద్దపల్లి జిల్లాలో విద్యుత్ అధికారుల చర్యలు

కమాన్‌పూర్, ఫిబ్రవరి 23 : వ్యవసాయ మోటర్ బిల్లు పెండింగ్‌లో ఉన్న వారి ఇంటి మీటర్ కనెక్షన్లను కట్ చేసే చర్యలకు శ్రీకారం చుట్టారు పెద్దపల్లి జిల్లా విద్యుత్తు శాఖ అధికారులు. వ్యవసాయ మోటర్ల బకాయి చెల్లించకపోతే ఇంటి కరెంట్ కనెక్షన్ కట్ చేస్తామంటూ ముందస్తుగా హెచ్చరిస్తున్నారు. దీంతో అప్పు చేసి కరెంట్ బకాయిలు కడుతుంటే.. మరికొందరు చేతిలో డబ్బులు లేక కరెంట్ క్షనెక్షన్లు పోగొట్టుకుంటున్నారు. కమాన్‌పూర్ మండలంలోని 9 గ్రామాల పరిధిలో 2888 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉండగా, బకాయిలు రూ.23,79,715 ఉన్నాయి. 2051 మంది బకాయిల్లో కొంత చెల్లించగా, 837 మంది చెల్లించాల్సి ఉంది. దీంతో అధికారులు రైతుల నుంచి ఎట్టి పరిస్థితుల్లోనైనా కట్టించాలని ఇంటి మీటర్ కనెక్షన్లు కట్ చేస్తామంటూ హెచ్చరిస్తూనే.. తొలగింపు చర్యలు చేపడుతున్నారు.

శివరాత్రికి 3 వేల ప్రత్యేక బస్సులు

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ) : మహాశివరాత్రి సందర్భంగా వివిధ శివాలయాలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం టీజీఎస్ఆర్‌టీసీ యాజమాన్యం మూడు వేల ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. ఈ నెల 24 నుంచి 28 వరకు 43 శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయించింది. శ్రీశైలానికి 800, వేములవాడకు 714, ఏడుపాయలకు 444, కీసరగుట్టకు 270, వేలాలకు 171, కాళేశ్వరానికి 80, కొమురవెల్లికి 51 బస్సులతోపాటు అలంపూర్, ఉమామహేశ్వరం, పాలకుర్తి, రామప్ప ఆలయాలకు వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. ప్రత్యేక బస్సుల్లో టికెట్ ధరలపై 50% అదనపు చార్జీలు వసూలు చేయనుంది. రెగ్యులర్ సర్వీస్ టికెట్ చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదు. టికెట్ల బుకింగ్‌కు www.tgsrtcbus.inను సంప్రదించాలని అధికారులు పేర్కొన్నారు. స్పెషల్ బస్సుల సమాచారం కోసం టీజీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033ను సంప్రదించాలని సూచించారు.

నాడు జలమాగాణం.. నేడు 'భూగర్భ' శోకం

- కాళేశ్వరం, మిషన్ కాకతీయతో ఏడాది పొడగునా నీరు
- కేసీఆర్ హయాంలో భూగర్భ జలాలు పెరిగినట్టు కేంద్రం నివేదిక
- ఉపరితల నీటి వినియోగంతో సమృద్ధిగా భూగర్భ జలాలు
- కేసీఆర్‌పై కక్షతో కాంగ్రెస్ సర్కారు తిరోగమన చర్యలు
- నీళ్లివ్వలేక ఫిబ్రవరిలోనే చేతులెత్తేసిన రేవంత్ సర్కారు
- వరిసాగు చేయొద్దనే దుస్థితికి చేరిన తెలంగాణ ప్రభుత్వం

'ఫిబ్రవరిలోనే ఎండలు ముదిరిపోతున్నాయి. రైతులు వరి సాగు చేయవద్దు. నీళ్లుంటేనే పంటలు వేసుకోవాలి. నీళ్లు లేనప్పుడు వరి వేయడం వలన ప్రయోజనం లేదు. పంటలపై పెట్టుబడి పెట్టిరైతులు నష్టపోవద్దు. బోర్లు వేసి అప్పుల పాలు కావొద్దు.'

- శుక్రవారం వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి చేసిన ప్రకటన

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ హయాంలో ఎండాకాలంలోనూ చెరువులు మత్తళ్లు దూకగా.. ప్రాజెక్టులు ఏడాది పొడవునా నిండుకుండలా తొణికిసలాడుతూ.. తెలంగాణలో సిరుల 'పంట' పండించాయి. ఓ వైపు కాళేశ్వరం ప్రాజెక్టుతో రిజర్వాయర్లు నిండటం, మరోవైపు మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్ధరణ జరిగి తెలంగాణ 'జలమాగాణం'గా పరిఢవిల్లింది. రైతును రారాజును చేయడమే లక్ష్యంగా సాగిన తొమ్మిదిన్నరేండ్ల పాలనలో ఏనాడూ చూడని భూగర్భ శోకం ఇప్పుడు రాష్ట్రంలో దాపురించింది. కేవలం 14 నెలల కాంగ్రెస్ పాలనలో చేపట్టిన తిరోగమన చర్యలతో రాష్ట్రంలో వ్యవసాయ రంగం సంక్షోభంలో చిక్కుకున్నది. పల్లెల్లో భూములు నెర్రెలు బారుతున్నాయి. కాంగ్రెస్ సర్కారు ప్రణాళిక లేమితో వనరులు ఉన్నా.. సద్వినియోగం చేసుకోలేకపోవడం రైతాంగం పాలిట శాపంలా మారింది. వరి పంట వేయొద్దని ఏకంగా రైతు కమిషన్ ప్రకటించే దుస్థితికి రాష్ట్రం చేరుకుంది. ఫిబ్రవరి నెల కూడా ఇంకా ముగిసిపోలేదు రాష్ట్రంలో అప్పుడే భూగర్భ జలాలు అడుగంటడం ప్రారంభమైంది. దీంతో రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతున్నది. కేసీఆర్ హయాంలో రైతులకు ఏడాది పొడవునా సాగుకు నీరు అందుబాటులో ఉండేలా ప్రణాళికలు రూపొందించి అమలుపర్చగా.. కాంగ్రెస్ 14 నెలలుగా మీనామేషాలు లెక్కిస్తూ సాగునీరు అందించడంలో చేతులెత్తేసింది.

కాళేశ్వరంతో ఉప్పొంగిన గంగ..

సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు, డైనమిక్ గ్రౌండ్ వాటర్ రిసోర్సెస్ ఆఫ్ తెలంగాణ స్టేట్ పొందుపర్చిన రిపోర్టు ప్రకారం కాళేశ్వరం ప్రాజెక్టు ప్రతిపాదిత ఏరియాలో 2020లో భూగర్భ జలాల లభ్యత 125.5 టీఎంసీలు ఉండగా.. కేసీఆర్ అమలు చేసిన సాగు ప్రణాళికతో 2022 నాటికి భూగర్భ జలాల లభ్యత 160.5 టీఎంసీలకు చేరింది. ఇదే ఏరియాలో మిషన్ కాకతీయ ద్వారా 2020లో భూగర్భ జలాల నీటి లభ్యత 10.8 టీఎంసీలుగా ఉండగా, 2022 నాటికి 12.4 టీఎంసీలకు చేరింది. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ ద్వారా నిరంతరం చెరువులు, చెక్ డ్యామ్‌ల్లో నీటి లభ్యత కారణంగా ఉపరితల నీటి వినియోగం పెరిగింది. తద్వారా భూగర్భ జలాల వినియోగం భారీగా తగ్గింది. దీంతో 2020లో ఈ ప్రాంతంలో భూగర్భ జలాలను 64 శాతం వినియోగించుకుంటే 2022 నాటికి అది ఏకంగా 55 శాతానికి తగ్గింది. అదే మిషన్ కాకతీయ పనులు చేపట్టిన ప్రాంతాల్లో భూగర్భ జలాల వినియోగం 77 శాతం నుంచి 67 శాతానికి తగ్గింది. మిగతా ప్రాజెక్టుల కింద ఉన్న ప్రాంతాల్లో సైతం ఇదే పరిస్థితి నెలకొన్నది. భూగర్భ జలాల వినియోగం తగ్గితే వచ్చే సీజన్‌లో అయినా వాటిని వినియోగించుకోవడంతో పాటు కరెంటు వినియోగం సైతం తగ్గుతుంది. కేసీఆర్ సాగు వ్యూహంతో ఉపరితల నీటి వినియోగం పెరిగి గ్రౌండ్ వాటర్ వినియోగం తగ్గుతూ వచ్చింది. తద్వారా గ్రౌండ్ వాటర్ ఏటికేడు పెరుగుతూ వచ్చింది.

సాగు నీళ్లియ్యండి సారో..

నీళ్లలో పడుకొని నిరసన తెలిపిన రైతు

పొట్టిమర్రి వాగులో పారుతున్న నీటిలో పడుకొని నిరసన తెలుపుతున్న రైతు

రాజాపేట, ఫిబ్రవరి 22 : 'చెరువులన్నీ ఎండిపోయాయి. భూగర్భ జలాలు అడుగంటి పోయి బోర్లు, బావులు ఒట్టిపోయాయి. నీళ్లు లేక సాగు చేసిన వరి పంట పొట్ట దశలో కండ్లముందే ఎండిపోతుంది. సీఎం సారూ.. మా తలాపు నుంచే కాళేశ్వరం నీళ్లు పుష్కలంగా పారుతున్నాయి. ఆ నీళ్లను మా వైపు మళ్లించి గొలుసుకట్టు చెరువులు నింపి సాగు జలాలు అందించి కరువుతో అల్లాడుతున్న రైతులను ఆదుకోండి.' అంటూ శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల కేంద్రానికి చెందిన రైతు నాగపూరి పుల్లయ్య మండల కేంద్రంలోని పొట్టిమర్రి వాగులో పడుకొని నిరసన తెలిపాడు.

రైతాంగానికి కాంగ్రెస్ ద్రోహం

నీటి లభ్యత పెంచి రైతుల సాగు అవసరాలు తీర్చడంలో భాగంగా కేసీఆర్ సర్కారు చెక్ డ్యామ్‌లను భారీగా నిర్మించింది. దీంతో భూగర్భ జలాలు మరింతగా పెరిగాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వ్యవసాయ రంగంలో సమగ్ర ప్రణాళిక వేయడంలో విఫలమైంది. ఏడాది కాలంలోనే పంట వేయొద్దు అనే దుస్థితికి కాంగ్రెస్ పాలన దిగజారింది. రాష్ట్రంలో నీటి వనరులున్నా.. కేవలం కేసీఆర్‌పై కక్షతో రైతాంగానికి కాంగ్రెస్ సర్కారు తీరని ద్రోహం చేస్తున్నది. కాళేశ్వరం ప్రాజెక్టును వినియోగించకుండా కుంగిన పిల్లర్ల సాకుతో పక్కన బెట్టిన ఫలితంగా ఈ దుస్థితి నెలకొన్నది. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు తెరిచి కాళేశ్వరం ప్రాజెక్టును సద్వినియోగం చేసుకొని చెరువులను, రిజర్వాయర్లను నింపాలని రాష్ట్ర రైతాంగం కోరుతున్నది.

నారాయణపేట జిల్లా మక్తల్ మండలం పసుపుల గ్రామ సమీపంలో నీటిమట్టం తగ్గడంతో రాళ్లు తేలిన కృష్ణానది

కళతప్పిన కృష్ణమ్మ

- రాళ్లు, రప్పలు తేలి బోసిపోయిన జీవనది
- చివరి ఆయకట్టుకు యాసంగిలో సాగునీరు ప్రశ్నార్థకమే
- ఆందోళన చెందుతున్న రైతులు

మాగనూరు/మక్తల్, ఫిబ్రవరి 22 : జీవనది కృష్ణమ్మ కళతప్పింది. జలకళను కోల్పోయి బోసిపోయింది. రాళ్లు, రప్పలు తేలి కనువిందు కరువైంది. నదిలో నీరు గణనీయంగా తగ్గడంతో ఎడారిని తలపిస్తున్నది. నారాయణపేట జిల్లా మాగనూరు, కృష్ణ నదీతీర ప్రాంతాల్లో నీరు పూర్తిగా తగ్గింది. యాసంగిలో సాగైన చివరి పంటలకు సాగునీరు అందుతుందా? అన్న ఆందోళన రైతుల్లో నెలకొన్నది. ఉమ్మడి పాలమూరు జిల్లాకు వరప్రదాయిని అయిన కృష్ణమ్మ అడుగంటడంతో ఎత్తిపోతలకు నీళ్లందని పరిస్థితి. మాగనూరు మండలం ముడుమాల్-ఏ, ముడుమాల్-బీ, మురారిదొడ్డి, కృష్ణ, తంగిడి లిఫ్ట్ నీటి ఆధారంగా వేల ఎకరాల్లో వరి పంట సాగైంది. ఎండాకాలం రాకముందే నదిలో నీళ్లు ఇంకిపోవడంతో సాగునీరు కష్టాలు తప్పవేమోనన్న ఆందోళనతో.. కొందరు రైతులు పంటలు ఎండిపోకుండా ఉండేందుకు నది మధ్యలో నుంచి పెద్ద పెద్ద మోటర్లు ఏర్పాటు చేసి ఉన్న నీటిని తోడేసుకుంటున్నారు. కాగా 24 గంటలపాటు మోటర్లు పనిచేసినా నీళ్లు పొలాలకు అందడం లేదని వాపోతున్నారు. నదిలో నీరు సమృద్ధిగా ఉంటేనే ఎత్తిపోతలకు నీరు అందుతుందని రైతులు పేర్కొంటున్నారు. అలాగే మక్తల్ మండలం పసుపుల, పంచదేవ్‌పాడు, పారేవుల ప్రాంతాల్లోని రైతులు యాసంగిలో 6 వేల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. 15 రోజుల కిందట మంత్రి జూపల్లి, ఎమ్మెల్యేలు కృష్ణానదికి నీటిని విడుదల చేయాలని కర్ణాటక సీఎం సిద్ధరామయ్యను కలిసి కోరినా.. నారాయణపూర్, ఆల్మట్టి ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలకు నిర్ణయం తీసుకోలేదు. ఇప్పటికైనా నీళ్ల వదిలేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కర్షకులు కోరుతున్నారు.

యూరియా కొరత తీరేదెన్నడు?

- ఉదయం నుంచే పీఏసీఎస్‌ల వద్ద బారులు తీరుతున్న రైతులు
- ఎండలను లెక్కచేయకుండా కేంద్రాల వద్ద పడిగాపులు

కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఇందుర్తిలో క్యూలో చెప్పులు పెట్టిన రైతులు

తిమ్మాపూర్/ చిగురుమామిడి/ వీణవంక/ కరీంనగర్‌రూరల్/లోకేశ్వరం, ఫిబ్రవరి 22 : యూరియా కోసం ఉదయం నుంచే సహకార సంఘాల గోదాములు, రైతు సేవా కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. శనివారం కరీంనగర్ జిల్లా వీణవంక మండలం చల్లూరులోని ఆగ్రోస్ రైతు సేవాకేంద్రానికి 230 బస్తాలే రావడంతో రైతులు వాటి కోసం ఎగబడ్డారు. ఇందుర్తిలో రైతులు చెప్పులను వరుస క్రమంలో ఉంచారు. రేకొండలో గంటల తరబడి వేచి చూశారు. కరీంనగర్ మండలం దుర్శేడ్‌లో రైతులు బారులు తీరి నిల్చున్నారు. తిమ్మాపూర్ మండలంలోని గ్రామాల్లో రైతులు అవస్థలు పడ్డారు. నిర్మల్ జిల్లా మన్మథ్ పీఏసీఎస్‌కు 1650 బస్తాలు రావాల్సి ఉండగా.. 450 మాత్రమే వచ్చాయి. దీంతో అధికారులు ఒక్కొక్కరికి ఐదు బస్తాలు మాత్రమే పంపిణీ చేశారు.

- మందు పిచికారి ఐడియా సూపర్..

రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం సంకేపల్లికి చెందిన సత్యనారాయణరెడ్డి పంటలకు చీడ, పీడల నివారణకు పొలాల్లో మందులు స్ప్రే చేసేందుకు యూ ట్యూబ్‌లో వీడియోలు చూసి రూ.3లక్షలు వెచ్చించి స్ప్రే యంత్రాన్ని ట్రాక్టర్‌కు ఫిట్ చేయించాడు. ఐదు నిమిషాల్లో ఎకరం పంటకు మందు పిచికారీ చేయవచ్చని, కూలీల కొరతతో ఈ ఆలోచన వచ్చిందని రైతు సత్యనారాయణరెడ్డి తెలిపారు. తెలంగాణలో మొదటగా తానే ఈ ట్రాక్టర్ స్ప్రే యంత్రాన్ని ఏర్పాటు చేయించానని పేర్కొన్నాడు. - చేవెళ్ల రూరల్

సాగుకు ట్యాంకర్ నీరే దిక్కు

- పంటకు నీళ్లందక పెద్దలింగాపూర్‌లో రైతు శ్రీనివాస్ నరకయాతన
- ఎకరంన్నర పాలానికి రోజుకు నాలుగు ట్యాంకర్ల నీళ్లు

వరికి ట్యాంకర్‌తో నీళ